# ఎన్నికలకు సర్వం సిద్ధం

- డీఆర్‌సీ సెంటర్ నుంచి సామగ్రిని తీసుకెళ్లిన సిబ్బంది
- కేంద్రాన్ని సందర్శించి పరిశీలించిన కలెక్టర్ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు
- నియోజక వర్గంలో 2.44లక్షల మందికి 284పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

నల్లగొండ, నవంబర్ 29: సాధారణ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. నల్లగొండ నియోజక వర్గంలో ఆర్వో రవి ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బంది గురువారం మధ్యాహ్నం వరకు ఎన్నికల సామగ్రిని తీసుకోని వారికి నిర్దేశించిన పోలింగ్ స్టేషన్లకు వెళ్లిపోయారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,44,446 మంది ఓటర్లు ఉండగా వారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి 284 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో సగటున 900 మంది ఓటర్లు ఓటు వేసేలా ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ స్టేషన్లకు సామగ్రిని తీసుకెళ్లేందుకు 85 వాహనాలు ఏర్పాటు చేసిన యంత్రాంగం 28 సెక్టార్ ఆఫీసర్ల ద్వారా 28 రూట్లల్లో పంపించారు. వీరు గురువారం సాయంత్రం వరకు ఆయా పోలింగ్ స్టేషన్లకు వెళ్లి నేడు జరగనున్న పోలింగ్‌కు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో ఒక పీఓతో పాటు ఏపీఓ, ఇద్దరు ఓపీఓలు విధులు నిర్వహించనుండగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో 52 మంది మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశారు. ఇక ప్రతి పోలింగ్ స్టేషన్లో ఇద్దరు పోలీసు సిబ్బందితో 568 మందితో నిఘా పెట్టిన అదికారులు ఎస్‌లు, సీఐలు, డీఎస్పీతో పర్యవేక్షించనున్నారు.

నేటి పోలింగ్ నిర్వహించిన అనంతరం అదే రూట్లల్లో ఈవీఎంలతో పాటు వీవీ ప్యాట్లను వాహనాల్లో తీసుకొని నల్లగొండలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ కేంద్రంలోకి తీసుకొచ్చి తిరిగి అక్కడ నుంచి ఆర్వో పరిశీలన అనంతరం దుప్పళ్లపల్లిలోని ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్‌ల్లోకి తరలించి భద్రపరచనున్నారు.



నల్లగొండ: ఎన్‌జీ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సిబ్బందికి సామగ్రి అందజేస్తున్న అధికారులు

## డీఆర్‌సీ కేంద్రం కలెక్టర్, ఎస్పీ పరిశీలన

నల్లగొండ నియోజక వర్గ కేంద్రానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ రీసోర్స్ కేంద్రాన్ని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎస్పీ అపూర్వ రావు సందర్శించి పరిశీలించారు. మొత్తం పోలింగ్ కేంద్రాల, సిబ్బంది కేటాయింపు తెలుసుకొని సామగ్రిని తీసుకెళ్లి పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ నిర్వహించి ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు ఎన్నికల సిబ్బందికి సూచించారు. వారి వెంట ఆర్వో రవి, మాస్టర్ ట్రైనర్ తరాల పరమేశ్ ఉన్నారు.

## పకడ్బందీ ఏర్పాట్లు : ఆర్‌వీ కర్ణన్

నల్లగొండ, నవంబర్ 29: ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. జిల్లాలోని దేవరకొండ, నాగార్జున సాగర్, మిర్యాలగూడ, దేవరకొండ, నకిరేకల్ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న పనుల గురించి డిస్ట్రిబ్యూషన్ ఆండ్ రిసెప్షన్ సెంటర్‌లను తనిఖీ చేశారు. సాధారణ ఎన్నికల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 30న ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి, ఓటర్లు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. పంపిణీ కేంద్రాల ద్వారా ఎన్నికల సామాగ్రి చేయడం జరుగుతుందని ఎన్నికల విధుల్లో పాల్గొని సిబ్బంది అధికారులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు, 5 గురికి మించి గుమిగూడ వద్దని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతిక్షణం అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. గురువారం జరుగబోయే ఎన్నికలకు జిల్లాలో అన్ని విధాల సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఆయన వెంట సాధారణ పరిశీలకులు బాల సుబ్రహ్మణ్యం, పోలీస్ పరిశీలకులు విజయ్ సింగ్ మీనా, ఎస్పీ అపూర్వ రావు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాటిల్ హేమంత్ కేశవ్ , శ్రీనివాస్, చెన్నయ్య, శ్రీరాములు, రవి, ఎన్నికల విభాగ ం సిబ్బంది ఉన్నారు,



నల్లగొండలో సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



నల్లగొండ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రి తరలిస్తున్న సిబ్బంది



నల్లగొండలో పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న అధికారులు



నల్లగొండ నుంచి పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది



నల్లగొండ నుంచి పోలీస్ కేంద్రాలకు వెళ్తున్న ప్రత్యేక బలగాలు



నల్లగొండ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేసుకుంటున్న అధికారులు





నల్లగొండలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

# నేడే పోలింగ్

- ఉదయం 7 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఓటింగ్
- ఉదయం 5.30 గంటల నుంచే మాక్ పోలింగ్
- జిల్లాలో 1,766 పోలింగ్ కేంద్రాలు. 14,64,080 మంది ఓటర్లు.
- 6 నియోజకవర్గాల బరిలో 14,64,080 మంది అభ్యర్థులు
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సామగ్రి, సిబ్బంది.
- సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలు
- ఓటు వేసేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి

నల్లగొండ ప్రతినిధి, నవంబర్29(నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లాలో 14,64,080 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 7,26,169 మంది, మహిళలు 7,37, 789 మంది, 122 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా నమోదయ్యారు. 543 మంది సర్వీస్ ఓటర్లుగా ఉన్నారు. ఇక వయస్సుల వారీగా పరిశీలిస్తే... 18–19 యేండ్ల మధ్య ఓటర్లు 60,840 మంది ఉండగా 80 ప్లస్ సీనియర్ సిటిజన్లు 17,424 మంది, దివ్యాంగులు 32,007 మంది, ఓవర్ సీస్ ఓటర్లు 76 మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 828 మంది ఓటర్లు ఉన్నారు. కాగా జిల్లాలో 1766 పోలింగ్ కేంద్రాలు, 2 యాక్జిలరీ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిల్లో గ్రామీణ ప్రాంతాల్లో 1067, పట్టణ ప్రాంతాల్లో 205 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

## అభ్యర్థుల సంఖ్య 144 మంది

నల్లగొండ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 144 మంది బరిలో నిలిచారు. దేవరకొండలో 13, నాగార్జునసాగర్ 15, మిర్యాలగూడ 23, నల్లగొండలో 31, మునుగోడులో 38, నకిరేకల్‌లో 23 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాగా ఒక్కో ఈవీఎంలో 16 మంది అభ్యర్థులకే అవకాశం ఉండనుంది. ఈ ప్రకారంగా చూస్తే దేవరకొండ, నాగార్జునసాగర్‌లలో ఒక్కో బ్యాలెట్ యూనిట్, మిర్యాలగూడ, నల్లగొండ, నకిరేకల్ లలో రెండు, మునుగోడులో మాత్రం మూడు బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నారు. ఒకటి కంటే ఎక్కువ ఉన్న చోట్ల ఓటర్లు జాగ్రత్తగా తాము ఓటు వేయదలుచుకున్న అభ్యర్థిని వెతుక్కని వేయాల్సి ఉంటుంది.

## మోడల్ పోలింగ్ కేంద్రాలు

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు చొప్పున ప్రత్యేకంగా మహిళా సిబ్బందితో నిర్వహించే పోలింగ్ కేంద్రాలు జిల్లాలో మొత్తం 30 ఏర్పాటు చేశారు. అదే విధంగా నియోజకవర్గానికి ఐదు చొప్పున మొత్తం 30 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున దివ్యాంగుల సిబ్బంది, మరొకటి యువత నిర్వహించేలా ఆరు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, మెడికల్ కిట్స్, వలంటీర్లు, ట్రాన్స్‌పోర్టు, క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ ఏర్పాటు చేశారు.

## సమస్యాత్మక కేంద్రాలు556

జిల్లాలో 336 ప్రాంతాల్లో 556 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. వీటి పరిధిలోనే దేవరకొండ నియోజకవర్గంలో 13 షాడో పోలింగ్ కేంద్రాలు, మునుగోడు నియోజకవర్గంలో 9 షాడో కేంద్రాలు కలిపి మొత్తం 22 షాడో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా ఉంటుంది. ప్రత్యేక పోలీసు బలగాలతో పర్యవేక్షణ కొనసాగనుంది. ఇక పోలింగ్ రోజున జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తారు. ఇందుకోసం 1,177 పోలింగ్ కేంద్రాల్లో 1,555 సీసీటీవీలు ఏర్పాటు చేశారు.

## 8140 మంది పోలింగ్ సిబ్బంది

పోలింగ్ విధుల కోసం 8140 మంది సిబ్బందిని వినియోస్తున్నారు. పోలింగ్ స్టేషన్ వారీగా ఒక్కో బృందం చొప్పున 1,768, రిజర్వ్‌లో మరో 1,068 బృందాలుగా సిబ్బంది విధుల్లో ఉన్నారు. వీరితో పాటు మైక్రో అబ్జర్వర్లుగా 410 మంది, 1,766 మెడికల్ బృందాలు, 1,400 మంది వలంటీర్స్ సేవలు కూడా వినియోగించుకుంటున్నారు. వీరు కాకుండా 3,079 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉన్నారు. వీరిలో ఏడుగురు డీఎస్పీలు, సీఐఈలు 15 మంది, ఎస్ఐలు 90 మంది, ఏఎస్ఐలు 308 మంది, కానిస్టేబుళ్లు 1,105 మంది, హెడ్ కానిస్టేబుళ్లు 1,739 మంది పోలీసులు విధుల్లో పాల్గొంటున్నారు. వీరు కాకుండా మూడు ప్లాటూన్ల టీఎస్ఎస్‌పీ బలగాలు, 19 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు కూడా అందుబాటులో ఉన్నాయి. వీరంతా బుధవారమే తమ విధుల్లో చేరిపోయారు.

## గుర్తింపుకార్డు తప్పనిసరి

ఓటరు తన ఓటు వేయడానికి గుర్తింపు కార్డు తప్పనిసరి. ఫోటో ఓటర్ గుర్తింపు కార్డు(ఎపిక్ కార్డ్), ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు/తపాలా పాస్ బుక్, కార్మిక శాఖ ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, భారతీయ పాస్ పోర్ట్, ఫొటో గల పెన్షన్ పత్రాలు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/పీఎస్‌యూలు/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు ఇలా ఫొటో కూడిన గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక గుర్తింపు కార్డును ఓటరు వెంట తీసుకెళ్లాల్సిందే.

## కౌంటింగ్ కేంద్రానికి తరలింపు

సాయంత్రం ఐదు గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంల అన్నింటిని తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలోని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాంలకు తరలించనున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి ముందుగా డిస్ట్రిబ్యూటరీ/రిసిప్షన్ కేంద్రాలకు అన్ని ఈవీఎంలు వచ్చాక అక్కడి నుంచి భారీ బందోబస్తు నడుమ వీటిని గోదాంలకు తరలిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌లో వీటిని భద్రపరచనున్నారు. వచ్చే నెల 3న ఇదే గోదాంలలో ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు.